# గరిక పూజ

—బులుసు వెంకటేశ్వర్లు

ఏకదంతం చిన్నప్పుడు ఎప్పుడూ వినాయకుణ్ణి గరిక గడ్డితోటే పూజించేవాడు. 'గడ్డి పూజ చాలా మంచిది నాయనా!' అని బామ్మ అంటూ ఉండేది!

చిన్నప్పుడు ఏకదంతం చదువుకున్న తీరు చూసిన వాళ్ళెవరైనా, అంత పెద్ద ఆఫీసర్ అవుతాడని అనుకున్నారా? గడ్డి పరకల్తో చేసిన పూజ ఫలితానికి వచ్చింది కాబోలు - ఒక్కొక్క క్లాసు కనీసం రెండుసార్లు డింకీలు కొట్టిన ఏకదంతం పెద్ద ఆఫీసరై పోయాడు. అతని కింద గోల్డు మెడల్సు సంపాదించుకున్న చదువుకున్న గుమాస్తాలు!! వ్యవస్థని తప్పుపట్టాలి తప్ప ఏకదంతాన్ని ఏమనలేం కదా! ఇంతకీ ఏకదంతం అదృష్టవంతుడు!!

ఏకదంతానికి ఎలా తెలుస్తుందో తెలియదు. ఏ శాఖలో సమీప భవిష్యత్‌లో 'గడ్డి' బాగా దొరుకుతుందో ఇట్టే పసిగడతాడు! వెంటనే సీటు 'ఛేంజి' చేయించుకుంటాడు! సుముహూర్తానికి పెళ్ళికొడుకు వచ్చి పీటల మీద కూర్చున్నట్టు ఆ విభాగంలో ఇన్-ఛార్జి ఆఫీసరై పోయి తన నోటికి అందిన గడ్డంతా తినేసి చక్కాపోతాడు!


మొన్నటికి మొన్న చూడండి! తుపాన్ వస్తోందనగా వారం రోజుల ముందే సీటు మార్పించుకుని - వచ్చి ప్రజల్లోపడి పోయి సుష్టుగా గడ్డి తినేసి బ్రేవ్‌మని త్రేన్చి - ఐపులేకుండా పోయాడు! ప్రజల ఏడుపు ఎవరిక్కావాలి??

ఏకదంతం శ్రీమతి ఓ మతిలేని మనిషి! మూడో పురుట్లో ఆవిడ మతిలేని మనిషైంది! అందుకు ఓ కథ కూడా చెప్పుకుంటారు! ఆవిడ హాస్పిటల్‌లో చేరిన రోజే ఉద్యోగం ఇప్పిస్తాను రమ్మని ఓ అమ్మాయిని ఇంటికాహ్వానించాడు ఏకదంతం! కూతురి వయస్సులో వున్న ఆ అమ్మాయిని చెయ్యి పట్టుకోగా ఆ పిల్ల ఉగ్రురాలై పోయి సాయంత్రానికల్లా ఓ వంద మంది అమ్మాయిల్ని పోగేసి ఏకదంతం ఇంటి ముందు నిరసన దీక్ష ప్రారంభించింది! వార్త పేపర్ల కెక్కింది!! హాస్పిటల్లోని ఇల్లాలు చెవికి చేరింది!! ఈ హడావిడిలో ఆవిడకి మతిపోయింది! తర్వాత కాన్పు అయ్యింది కానీ బిడ్డ దక్కలేదు!!

ఏకదంతానికి ఈ వ్యవహారంలో ఉద్యోగం పోయి నంతపనైంది! కానీ అతనిపైన కూడా ఒకళ్ళో ఇద్దరో 'గడ్డి' తినే వాళ్ళుండబట్టి ఏకదంతం బతికిపోయాడు! ఇది సత్యం!· సత్యమేవ జయతే కదా మరి! అంచేత జయించింది!! ఏకదంతం ఉద్యోగంలో జేరిన రోజు నుండి గడ్డితింటూనే వున్నాడు! అసలు మానిందెప్పుడు? నదురూ బెదురూలేని 'మానవుడు కావున' - ధైర్యంగా తింటున్నాడు! ఉద్యోగంలో ప్రమోషన్ రాని రోజుల నాటికే కలర్ టి.వి., స్కూటర్, ఫ్రిజ్, అక్కడ అక్కడా రెండు మూడు ఇంటి స్థలాలూ కొనేసాడు! పెళ్ళాం మెళ్ళో రెండు గొలుసులు (బంగారంవే) వేసేసాడు! అంతా బాగానే వుందనుకున్నాడు! గడ్డి జీర్ణానికొస్తోందనుకుంటున్న సమయంలో ఏకదంతం శ్రీమతి నెల తప్పింది! వార్త విని ఓ నిర్ణయానికొచ్చాడు - ఏకదంతం. 'పిల్లలు పుట్టు కొస్తున్నారు - ఇంక నాలుగు చేతులా సంపాదించుకోవాలి' అని!

ఏకదంతం అదృష్టవంతుడు! ప్రథమంగానే పుత్రలాభం! కానీ ఏం లాభం?? కుర్రాడికి నాల్గు అయిదేళ్ళు వచ్చేసరికి వాణ్ణి చూసి డాక్టరు పెదవి విరిచేసారు! పిల్లవాడు ఎదుగుతాట్టగానీ మెదడు ఎదగదుట! ఘోరం! ఘోరం అనుకున్నాడు ఏకదంతం! ఆ ఏకదంతం కొడుక్కి ఇప్పుడు ఇరవై ఏళ్ళు ఒంటిపైకి వచ్చాయి - మనస్సుకి మాత్రం ఏడాది జ్ఞానం కూడా లేదు! ఇద్దరు మనుషుల్ని పెట్టి వాడి ఆలనా పాలనా చూసుకుంటున్నాడు ఏకదంతం!

ఏకదంతం గడ్డి తినడం మాన్లేదు! మళ్ళీ ఓ ఆడపిల్ల పుట్టింది! పెరిగింది! అంగరంగ వైభోగంగా పెళ్ళిచేసాడు ఆ పిల్లకి! అల్లుడు కూతురితో కాకుండా బ్రాందీ సీసాతోటే కాపురం చేస్తూండడం వల్ల - ఆ పిల్ల పుట్టింట్లో ఉండిపోయింది! ఆ పిల్ల కూడా గడసరి కాదు! అమాయకప్పిల్లే!



ఏకదంతం శ్రీమతికి మూడో పురుట్లో కుర్రాడు పుట్టాడు. తల్లిని మతిలేనిదాన్ని చేసి - పుట్టిన మరుక్షణం కన్నుమూసాడు!

ఏకదంతానికి లోకం మీద కసి పెరిగిపోయింది!

సైకిల్ మీద ఝూమ్మనిపోయే ఇరవైయేళ్ళ కుర్రాళ్ళని చూసినా - మొగుడితో నవ్వుకుంటూ వెళ్ళుకుంటూ - జళ్ళో మల్లెదండ సవరించుకుంటూ పోయే యువతుల్ని చూసినా - ప్రౌఢత్వంతో గంభీరంగా వుండి లక్ష్మీకళతో మెరిసిపోయే మహిళల్ని చూసినా ఏకదంతానికి ఒళ్ళు భగభగలాడిపోయేది!! నిద్రపట్టేది కాదు!! నిద్రమాత్రలు వేసుకుని మంచం ఎక్కేవాడు ఏకదంతం!!

ఓ రోజు - రాత్రి ఏకదంతానికి కల వచ్చింది!

ఎవరో ఇద్దరు దివ్య పురుషుల్లా వున్నారు - ఏకదంతం గురించి మాట్లాడుకుంటున్నారు!

"చూసావా! నే చెప్పలేదూ తెలుసుకోలేడని —" మొదటి వ్యక్తి!!

"ఈసారి తెలుసుకుంటాడు —" రెండో ఆయన!!

మొదటి వ్యక్తి పకపకనవ్వాడు! రెండో ఆయనకి కోపం వచ్చింది!

"ఏమిటా పిచ్చి నవ్వు?" గద్దిస్తూ అడిగాడు!

మొదటి వ్యక్తి చేత్తో జుట్టు పట్టుకు చూపిస్తూ ఇలా అన్నాడు, "నేను ఇంతమందిని చూసాను! తెలుసుకున్నవాడు ఒక్కడూ లేడు!!"

"ఎవరి విషయమో ఎందుకు ఇతని విషయంలో పందెం కాయిదమ్ముంటే—"

"పందెం"

"సరే! చూద్దాం! గెలుపువాదే!!"

ఇరువురూ మాయమయ్యారు! ఏకదంతానికి మెలుకువ వచ్చింది! "వెధవ కలలు! తలా తోకా లేని కలలు—" అనుకున్నాడు విసుగ్గా! టైం చూస్తే ఒంటి గంట!! పక్క గదిలో ఏకదంతం పెళ్ళాం ఏమిటో గొణుక్కుంటున్న శబ్దం!!

మంచినీళ్ళు తాగి పడుకున్నాడు ఏకదంతం! తెల్లారి ఇద్దరు వచ్చారు!

"ఈ పని మీరే చేసి పెట్టాలి!" అన్నారు! మూడు మోపులు టేబుల్ మీద పెట్టారు! ఏకదంతం వాళ్ళ మీద గట్టిగా ఎగిరాడు! వాళ్ళు మరో రెండు మోపులు టేబుల్‌పై పెట్టారు!

వాళ్ళు వెళ్ళిన మరుక్షణం ఆ మోపుల్ని బీరువాలోకి తోసేసాడు! "ఇదా రాత్రి వచ్చిన కలకి పరమార్థం! తెలుసుకోలేక కంగారుపడ్డాను—" అనుకున్నాడు!

మరో వారం గడిచింది!

ఓ నాడు ఏకదంతానికి కళ్ళు తిరిగాయ్! ముచ్చెమట్లు గ్రమ్మాయ్! బాత్‌రూంలో కూలబడిపోయాడు! సాయంత్రం హాస్పిటల్‌కి వెళ్ళాడు! డాక్టర్ అన్ని పరీక్షలూ జరిపించాడు!

"సారీ సార్, మీకు షుగర్, బి.పి.రెండూ వున్నాయ్! ఈ మందులు జాగ్రత్తగా వాడుతుండండి! ఆహారాన్ని కూడా మార్చుకోవాలి!" అన్నాడు డాక్టర్.

నాటి నుంచి ఏకదంతం మింగిన మందులకి లెక్కలేదు.

ఆర్నెల్లు సిక్‌లీవు పెట్టి ఇంట్లో కూర్చున్నాడు!

అర్థ సంవత్సరం గడ్డి తినకుండా ఏకదంతం కాలక్షేపం చేసేడంటే మాటలా?

"ఆ కేసు డీల్ చేస్తే ఇంత వచ్చును! ఈ కేసు డీల్ చేస్తే అంత వచ్చును" అంటూ లెక్కలు వేసుకుంటుంటే ఆ బి.పి. కాస్తా మరింత ఎక్కువై పోయేది!!

కఠిన పథ్యాలకి నోరంతా రుచిపోయింది! ఏనుగులాంటి ఏకదంతం పీనుగైపోయాడు!

చివరికి 'అనేక దంతానికి' కబురు పెట్టక తప్పలేదు ఏకదంతానికి!!

అనేకదంతం - ఏకదంతానికి వరసకు చెల్లెలవుతుంది! వెనక ఎవరూలేని ఏకాంతువు! ఆవిడ వయస్సులో వున్నప్పుడు నోట్లో మూడు వరసల పళ్ళుండడంవల్ల బంధువులంతా ఆవిడ్ని అనేకదంతం అని పిల్చేవారు! ఆ పేరే స్థిరపడిపోయింది - ఆ పళ్ళుస్థిరపడక పోయినా!!

మనస్సు ఎదగని కుర్రాణ్ణీ, మతిలేని శ్రీమతినీ, అమాయకురాలైన కూతుర్నీ, లంకంత కొంపనీ, ఇనప్పెట్టె తాళాల గుత్తినీ, అనేకదంతం చేతిలో పెట్టాడు ఏకదంతం!!

అన్ని వైద్యాలూ చూసి చివరాఖరికి ప్రకృతి వైద్యాన్ని ఆశ్రయించాడు ఏకదంతం!! ప్రకృతి ఆశ్రమంలో జాయిన్ అయ్యాడు!! జాయినైన సాయంత్రం ఓ గ్లాసులో ఏదో ద్రవం పట్టుకొచ్చింది నర్స్! ఆ గ్లాసు అందుకుని గడగడ తాగేసాడు ఏకదంతం!!

"ఇంకా ప్లటండి చాలా బాగుంది" అన్నాడు మూతి తుడుచుకుంటూ!! నర్స్ తెల్లబోయి నిలబడింది!

"ఎంత ఖరీదైనా ఫర్వాలేదు! ఇంకా ప్లటా! ఏమిటీ పానీయం ఇంత మధురంగా వుంది-" అన్నాడు ఏకదంతం!

ఒక్క గ్లాసు ద్రవం తాగడానికి హాస్పిటల్ అంతా పరుగులెత్తించే రోగుల్నే చూసిన ఆ నర్స్‌కి ఏకదంతం మాటలు వినగా మతిపోయింది!!


"సార్ అది పచ్చగడ్డి రసం సార్! రోజుకు రెండు పూటలా రెండు గ్లాసులు తాగుతూ వుండాలి మీరు!!" అంది ఆమె కొంచెం బెరుగ్గా!!

ఏకదంతం మహదానందంతో ఆమె కాళ్ళ మీద అమాంతం పడిపోయాడు!!

"రోజుకి కనీసం నాలుగైదు గ్లాసుల గడ్డి రసం ఇస్తానంటే కానీ లేవను" అన్నాడు బింకంగా!!

చెట్టంత మనిషి గడ్డి (రసం) కోసం కాళ్ళ మీద పడితే ఏం చెయ్యాలో తెలీక స్థాణువైపోయింది ఆ పిల్ల!!

ఫలశ్రుతి: ఈ ఏకదంతం కథను అర్థం చేసుకుంటూ చదివి, చవితి నాడు వినాయకుణ్ణి పూజించిన, అక్షింతలు నెత్తి మీద వేసుకున్న ప్రభుత్వాధికారులూ ఉద్యోగులూ ఇహపరాల్లో సర్వసుఖాలు అనుభవిస్తారు! నాత్ర సందేహః!!



## "వినాయకో విఘ్ననాశః

సకల విఘ్న వినాశకుడైన వినాయకుడి జననం గురించి రకరకాల గాథలను వివిధ పురాణాలు చెప్తాయి. అందులో ఒక గాథ వరాహ పురాణంలోనిది. శ్రీ వరాహ పురాణంలో వివరించబడిన విఘ్నేశ్వరుడి జన్మ కథ ఈ విధంగా వుంది.

పూర్వం రాక్షసుల బాధ ఎక్కువగా వుండేది. దేవతలు, ఋషులు శివుని వద్దకు వెళ్ళి రాక్షసుల బాధ పోగొట్టే ఉపాయం చెప్పమని కోరారు. దాని గూర్చి ఆలోచిస్తూన్న శివుడు తల ఎత్తాడు. అపుడాయనకి ఎంతో సుందరమైన రూపంతో పార్వతీదేవి కన్పించింది. "నీటికి, భూమికి ఒక రూపం వుండగా ఆకాశానికి ఎందుకు లేదని" ప్రశ్నించాడు. పార్వతిని చూసి ఆకాశాన్ని గూర్చి ఇలా ప్రశ్నించడం వల్ల ఆ ఆకాశం పుత్రుడి రూపంలో గోచరించింది. ఆతడి రూపం ఎంతో మనోహరంగా వుండడంతో పార్వతి కూడా భ్రమపడి తదేక దృష్టితో చూడసాగింది. ఈ బాలుడు ఇతర దేవతా స్త్రీల మనస్సును కూడా ఇలాగే భ్రమింపచేయడంతో పరమ శివుడికి అంతులేని కోపం వచ్చింది. ఆ కోపోద్వేగంతో "నీకు ఏనుగు తల, బొజ్జ కడుపు వస్తుంది. సర్పాలు నీకు యజ్ఞోపవీతాలవుతాయి" అని ఆ బాలుడిని శపించాడు. ఆకాశం నుండి అతిలోక సుందరంగా ఆవిర్భవించిన ఈ సుకుమార బాలుడు, సర్వావయవ సౌందర్య విలసితుడు, ఏనుగు తలతో, బాన కడుపుతో తయారయ్యాడు. ఆతడే అందరి పూజలందుకునే వినాయకుడు. విఘ్న నాశకుడు. ఇంకా శివుడి కోపం చల్లారలేదు. ఆ క్రోధావేశంలో శంభుడి శరీరం అంతా చెమర్చింది. ఆ చెమట బిందువుల నుండి గజాస్యులు పుట్టారు. దేవతలు, మునీంద్రులు ఎన్నో విధాలుగా ప్రార్థించి ఎలాగైతేనేం శాంతింప చేశారు. ఆ గజాస్యులంతా విఘ్నేశ్వరుడి అనుచరగణమవుతారని — ఏ పని చేసినా అందరూ విధిగా ముందు పూజిస్తారని శివుడు అనుగ్రహించాడు. గణాధిపులకు అధిపతియైన గణపతి, విఘ్నాలను వశింపచేసేవాడైన వినాయకుడిని ఆరాధించే సంప్రదాయం భారతీయులకే కాక ఎందరో భక్తులకు ఆచారంగా వస్తుంది. "తొండము నేకదంతమును తోరపు బొజ్జయు వామ హస్తమున్ ..!" అనే పద్యం రానివాడు తెలుగు వాడే కాదు. పార్వతీ పరమేశ్వరుల గారాబు పట్టియైన వినాయకుడి సంపూర్ణ గాథ గణేశ పురాణమనే ఉప పురాణంలో మరింత విస్తరంగా చెప్పబడింది.

— కె.రఘుపతి